# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారీ వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న వరద పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు.**
2. **వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను ఆదుకోవడంలో బ్యాంకులు, బీమా సంస్థలు సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**
3. **వరద ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు.**
4. **వరదలను ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.**
5. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరో నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**
6. **మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఈ రోజు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.**

==========================

భారీ వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్ లో నెలకొన్న పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వరద పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, తక్షణ సాయం కోసం సిఫారసులు చేసేందుకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. కేంద్ర విపత్తు నిర్వహణ శాఖ అదనపు కార్యదర్శి ఆధ్వర్యంలో నిపుణులతో కూడిన బృందం. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరద నిర్వహణ, రిజర్వాయర్ నిర్వహణ, ఆనకట్టల భద్రత వంటి అంశాలపై సిఫార్సులు చేస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి పేర్కొన్నారు.

--------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లోని వినియోగదారులు, ఖాతాదారులను ఆదుకోవడంలో బ్యాంకులు, బీమా సంస్థలు సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమై పలు

సూచనలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, బ్యాంకులు, బీమా సంస్థలు మానవీయ దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–ఆర్‌బీఐతో మాట్లాడుతున్నామని చెప్పారు. వరద బాధితుల వివరాలు గుర్తించి బ్యాంకర్లకు ఇస్తామన్నారు. వారి రుణాలు రీషెడ్యూల్ చేయాలని, నిబంధనలు సడలించి, కొత్త రుణాలను అందజేయాలని బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.

---------------------------

వరద ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని ముంపు గ్రామాల్లో నిన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ, బాపట్ల జిల్లాలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. వరదలతో నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

వరదలను ఎదుర్కోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిన్న హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందన్నారు. వర్షాల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణకి సాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. అధికారులు,ప్రజలకు అందుబాటులో ఉండాలని, సహాయక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని చెప్పారు.

---------------------------

బుడమేరుకు మూడు ప్రాంతాల్లో గండ్లు పడటం వల్లే విజయవాడలోని పలు ప్రాంతాలు నీట మునిగాయని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నిన్న విజయవాడలో మంత్రి మాట్లాడుతూ, గండ్లు పడటంతో సింగ్ నగర్, రాజరాజేశ్వరిపేట, ఆంధ్రప్రభ కాలనీ, జక్కంపూడి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. గండ్లను పూడ్చి పరిస్థితిని సాధారణ స్థితికి వచ్చేంత వరకు పర్యవేక్షిస్తామని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. విపత్తు సమయాలలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. నిన్న విజయవాడలోని రాజరాజేశ్వరి పేట వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని అన్నారు. వరద కారణంగా మరణించిన వారి కుటుంబాలకు 25 లక్షల రూపాయలు పరిహారం అందించాలని, ప్రతి ఇంటికి 50 వేల రూపాయలు అందించాలని కోరారు.

---------------------------

అధ్యాపకవృత్తికి వన్నె తెచ్చి, అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించిన భారత తొలి ఉపరాష్ట్రపతి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఈరోజు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ఉపాధ్యాయునిగా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది రాష్ట్రపతి పదవి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుత్తనిలో 1888 సెప్టెంబర్ 5వ తేదీన జన్మించారు. విద్యార్థులకు చిన్నతనం నుండే వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని ఒకానొక సందర్భంలో ఆయన సూచిస్తూ...

..వాయిస్... 20 సెకన్లు

కాగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో హైడ్రా పేరుతో హెచ్చరికలు, అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. నిన్న ఆయన హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, సామాజిక కార్యకర్తల పేరుతో నిర్మాణ రంగ బిల్డర్లపై అక్రమాలకు పాల్పడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. హైడ్రాపై అసత్య ప్రచారం చెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అక్రమంగా వ్యవహరిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు.

---------------------------

బంగాళాఖాతంలో కోస్తాంధ్రకు సమీపంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని దీని ప్రభావంతో రాబోయే 24 గంటల్లో పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు రుతుపవన గాలుల ద్రోణి 1500 మీటర్ల ఎత్తున రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి మధ్యప్రదేశ్, రామగుండం, కళింగపట్నం మీదుగా బంగాళాఖాతం వరకూ వ్యాపించి ఉందని, దీని ప్రభావంతో ఈ రోజు నుంచి రానున్న 4 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు కురుస్తాయని, తీరం వెంబడి 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

మరోవైపు తెలంగాణలోనూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో నాలుగు రోజుల పాటు భారీగా వర్షం కురిసే సూచనలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల్లో వరదలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపింది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రకటించారు. ప్రజలెవరూ

వాగులు వంకల వద్దకు వెళ్లవద్దని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి కరకట్టపై రాకపోకలు నిలిపివేశారు.

---------------------------

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు కావడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర రహదారి రవాణా సంస్థ - టిజియస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. రాజధాని, ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులలో ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ముందస్తు రిజర్వేషన్ కోసం tgsrtcbus.in వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

---------------------------

విజయవాడ ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. నిన్న సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించిన ఆమె.. వరద బాధితులను పరామర్శించారు.

======================